# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 21, మే 2026


## వరుస బైక్ దొంగతనాల కేసులు ఛేదించిన మందమర్రి పోలీసులు

**✪ నిందితుడి అరెస్ట్.. రూ. లక్షల విలువైన 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

మందమర్రి, మే 20, ప్రభాతవార్త



మందమర్రి పట్టణంలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ. లక్షల విలువైన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మందమర్రి సీఐ పర్స రమేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన గటాడి లక్ష్మీనారాయణ (48) స్థానిక పెట్రోల్ బంక్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పెట్రోల్ బంక్‌కు వచ్చే వాహనాలను గమనిస్తూ, పట్టణంలో నిర్లక్ష్యంగా పార్క్ చేసిన బైక్‌లను లక్ష్యంగా చేసుకొని మాస్టర్‌కీ సహాయంతో లాక్‌లు తీసి వాహనాలను అపహరించేవాడని తెలిపారు. గత కొంతకాలంగా మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ దొంగతనాలు జరుగుతుండటంతో బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మిగతా 2లో..



## ప్రజల సంక్షేమం కోసం
# రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది

**✢ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 20, ప్రభాతవార్త

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జూన్ 2వ తేదీన జరగనున్న ఇందిరమ్మ పండుగలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమురం భీం జిల్లాలో పాల్గొంటున్న నేపథ్యంలో ఆ ప్రాంతాలను బుధవారం రాష్ట్ర ఆబ్కారీ మధ్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనేక మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇందిరమ్మ నిర్మాణం పండుగ ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి జిల్లాలోని 3 గ్రామాలను పరిశీలిస్తారని తెలిపారు. జిల్లాలోని కొఠారి గ్రామంలో గిరిజన బిడ్డలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిందని, ఆదివాసీల ఇండ్ల కష్టాలు తొలగించిందని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి మహిళను ఇంటి పెద్దగా గుర్తించి సంక్షేమ ఫలాలను అందిస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, విద్య సంస్థలను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య



అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు, మరింత వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలల ద్వారా వైద్యులు, మిగతా 2లో..

## వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను
# పకడ్బందీగా చేపట్టాలి

**★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

వేమనపల్లి, మే 20, ప్రభాతవార్త

వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం వేమనపల్లి మండల కేంద్రంలో గల గోదామును సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని మిగతా 2లో..

# ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**■ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత**

కాగజ్‌నగర్ రూరల్, మే 20, ప్రభాతవార్త :



జిల్లాలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కె హరిత అన్నారు. బుదవారం కాగజ్ నగర్ పట్టణంలో పలు వార్డులను ఉమ్మడి జిల్లా ఎం ఎల్ సి దండె విఠల్, అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి ఎన్ ప్రకాష్ రావుతో కలిసి కలెక్టర్ సందర్శించి స్థానిక నాలుగు ,పదహారు వార్డులలో నిర్మాణంలో ఉన్న పలు ఇండ్లను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడుతలో మజురైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటికి మజురైన ఇండ్ల నిర్మాణాలు నాణ్యతతో జరిగేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్య వేక్షించాలన్నారు. లబ్ధిధారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయలన్నారు వచ్చే నెలలో 2 వ విడుత ఇందిరమ్మ ఇండ్ల మంజూరికి ప్రభుత్వం చర్యలు తీసుకుంట్నుదని అర్హులైన లబ్దిదారులకు ఇల్లు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమములో మున్సిపల్ అధికారులు గృహ నిర్మాణ శాఖ అధికారులు, కౌన్సిలర్లు, కాలనీ వాసులు లబ్దిదారులు పాల్గొన్నారు.

# వరుస బైక్ దొంగతనాల కేసులు ఛేదించిన మందమర్రి పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. మందమర్రి పరిధిలో నమోదైన నాలుగు వేర్వేరు కేసుల్లో (క్రైమ్ నంబర్లు 99, 100, 110, 112 / 2026) తానే దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి స్ప్లెండర్ ప్రో, స్ప్లెండర్ ప్లస్, రెండు హెచ్ఎఫ్ డీలక్స్ బైకులను రికవరీ చేసినట్లు వెల్లడించారు. వరుస దొంగతనాల కేసులను చాకచక్యంగా ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ నరేష్‌తో పాటు సిబ్బంది రాకేష్, మహేష్, చైతన్యలను సీఐ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు సీఐ రమేష్ సూచనలు చేస్తూ.. ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని, కేవలం హ్యాండిల్ లాక్‌తో కాకుండా అదనపు డబుల్ లాక్‌లు వేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘా ఉన్న ప్రాంతాల్లో వాహనాలను ఉంచడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు.

### వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను

# పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయికృష్ణ, స్థానిక ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, ఆర్ఐ ఖాళీక్, సంబంధిత అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు లబ్ధిదారుల ఇంటర్వ్యూలు

**చింతలమానేపల్లి, మే 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ పథకాల కోసం దరఖాస్తు చేసుకొని ఎంపికైన లబ్ధిదారులకు గురువారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. సంబంధిత లబ్ధిదారులు తమ ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులతో సమయానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

## గోలేటి సిహెచ్పిలో మల్టీ డిపార్ట్మెంట్ సమావేశాలు

**తాండూర్, మే 20, ప్రభాతవార్త :**

గోలేటి సిహెచ్పిలో బుధవారం మొదటి , రెండో షిఫ్టులో మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ అధికారులు, అన్ని విభాగాల అధిపతులకు సింగరేణి సంస్థ గతంలో సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగులు, మహిళ ఉద్యోగులు, యంత్రాల వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిహెచ్పి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎండిటి కన్వీనర్, ఇంచార్జి ఎస్ ఓ టు జిఎం ఉమాకాంత్ మాట్లాడుతూ సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్ లో లక్ష్యాల సాధనకు ఉద్యోగుల పనితీరు ఎలా ఉండాలో వివరించారు. యంత్రాల వినియోగాన్ని పెంచాలని ఉద్యోగులకు సూచించారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు కోసం ఉద్యోగుల నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహార, సిహెచ్పి హెచ్ ఓ డి కోటయ్య, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)



సిబ్బంది సంఖ్యను పెంపొందించి ప్రజలకు మరింత చేరువలో వైద్యాన్ని ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026-28 సంవత్సరానికి గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు..

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్, కాగజ్ నగర్ మండలం దాదానగర్, కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం రాష్ట్ర ఆబ్కారీ మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంచనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఏప్రిల్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్ష ఇండ్లు మంజూరయ్యాయని, జూన్ నాటికి 2.35 లక్షల ఇండ్లు పూర్తవుతాయని తెలిపారు. ఆదివాసి జిల్లాలో జూన్ 2వ తేదీన జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు.

# జీవ వైవిధ్యం కాపాడితేనే భవిష్యత్ భద్రం

**వేమనపల్లి, మే 20, ప్రభాతవార్త**



ప్రకృతి పరిరక్షణ, అరుదైన జీవ జాతుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రకృతి మిత్ర సంస్థ ఆధ్వర్యంలో జీవ వైవిధ్య సదస్సు బుధవారం నీల్వాయి రైతు వేదికలో నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి విత్తన బంతులు చల్లుతూ మొక్కలు నాటుతూ అందరికీ పర్యావరణంపై అవగాహన కలిగేలా నిలిచిన కార్యక్రమం శ్రీకారం చుట్టారు. ప్రకృతి మిత్ర వ్యవస్థాపకుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ నిపుణులు సదస్సులో వక్తలు మాట్లాడుతూ జీవ వైవిధ్యం మనుగడకు ఎంతో కీలకమని, అడవుల నరికివేత, కాలుష్యం కారణంగా అనేక జీవ జాతులు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటరు. అనంతరం నీల్వాయి అటవీ ప్రాంతంలో వివిధ రకాల విత్తనాలతో నల్లరేగడి మట్టి, పేడతో కలిపి చేసిన విత్తన బంతులను వెదజల్లారు. స్థానిక సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ ప్రకృతి మిత్ర స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలించడానికి తమ గ్రామపంచాయతీలో ప్రతి ఇంటికి అవసరమైన బట్ట సంచులను త్వరలో స్టీలు ప్లేట్లను అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్, న్యాయవాది నటేశ్వర్, రాజేంద్రప్రసాద్, దుర్గం రాజేశం గౌడ్, నీల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి హాఫిజుద్దీన్, ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీఓ వెంకటేష్, పలువురు సభ్యులు, అటవీ శాఖ, ఆశ కార్యకర్తలు, రైతులు, మహిళలు ,స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మంచిర్యాల క్రీడాకారుల ప్రతిభ

**బెల్లంపల్లి, మే 20, ప్రభాతవార్త**



ఈనెల 14 నుండి 18వ తేదీ వరకు గద్వాల్ పట్టణంలో టైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టిఎఫ్ఐ) ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన 16వ జాతీయ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో మంచిర్యాల జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. బంగారు పతకాలు సాధించిన జి. విజయచంద్ర ప్రసాద్, ఎస్సిక, శ్రేయాన్స్, లాస్య శ్రీ, శ్రేణిత్ సాయి, వేణుగోపాల్, సంజు, ప్రమోద్ కుమార్, ప్రభుదేవా, రిషి పాల్, ప్రణయ విద్య. రజిత పతకాలు సాధించిన వారు హేమంత్, హర్షన్, అక్షిత్, అచ్యుత్, అకిరా నందన, ఆద్యాన్, సంజయ్, కార్తికేయ, కాంస్య పతకాలు సాధించిన మహా యాద్రి, రామ్ చరణ్ తేజ్, ఆర్యన్, మాన్విత్, సాజన్, హర్షవర్ధన్, అభినయ్ వర్మ, అను శ్రీ వర్మ, ఆశ్రిత్. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను శిక్షకులు కామిండ్ల సుధాకర్, జంగపెల్లి అజయ్, శనిగారపు ప్రభుదేవా లను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఏసీపీ కిరణ్ కుమార్, ఎస్సై రామకృష్ణ అభినందించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు బుచ్చి రామారావు, రగ్బీ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ (మాజీ డిఎస్పి) రవికుమార్, రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆనంద్, కొమురం భీం జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గజేందర్ యాదవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ట్రెజరర్ సుధాకర్, వికే స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ చక్రపాణి, అధ్యక్షుడు షఫీ, కార్యదర్శి రాజ్ మహమ్మద్ తదితరులు క్రీడాకారులను అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనే ఐఎన్టీయూసీ ఏకైక లక్ష్యం

**- సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వంతో ఎంతటికైనా పోరాడతాం**

**- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్**




**నస్పూర్, మే 20, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తామని, సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనే ఐఎన్టీయూసీ ఏకైక లక్ష్యమని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ స్పష్టం చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ప్రధాన సమస్యలపై సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ అన్ని యూనియన్లను కలుపుకొని సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఎంతటికైనా పోరాడతామని ప్రకటించారు. సింగరేణిలో స్పేర్ పార్ట్స్, ఇంజిన్ ఆయిల్ అందుబాటులో లేక కోట్లాది రూపాయల విలువైన యంత్రాలను వాడకుండా పక్కన పెట్టారని జనక్ ప్రసాద్ ఆరోపించారు. లోక్ అదాలత్ నిర్వహించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పులను అమలు చేయకుండా ఉన్నత న్యాయస్థానాలకు అప్పీలుకు వెళ్లడం సరికాదన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ సింగరేణిలోని మిగులు నిధులను కొల్లగొట్టడం వల్లే నేడు సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. దీనివల్ల కొత్త గనుల ప్రారంభానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ యాక్ట్ విధానాల వల్ల రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను ప్రైవేటు పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారని ధ్వజమెత్తారు. ఐఎన్టీయూసీ చేసిన డిమాండ్ మేరకు యాజమాన్యం తొమ్మిది గనులను విస్తరించనున్నట్లు ప్రకటించడం తమ పోరాట ఫలితమేనని జనక్ ప్రసాద్ తెలిపారు. గనుల విస్తరణ ద్వారానే మిగులు కార్మికుల సమస్య పరిష్కారం, మెడికల్ ఇన్వాలిడేషన్ డిపెండెంట్లకు ఉద్యోగాలు, డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి అవకాశం లభిస్తుందని సూచించారు. బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనేలా తాము చేసిన ఒత్తిడికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఐఎన్టీయూసీ కృషి వల్లే మెడికల్ బోర్డు పునరుద్ధరణ జరిగిందని, 370 మంది డిపెండెంట్లకు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికులకు పూర్తిస్థాయిలో ఇన్వాలిడేషన్ అమలు చేయాలని డిమాండ్ చేయడంతో యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకుందని వివరించారు. కార్మికుల ప్రధాన డిమాండ్లయిన సొంతింటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని, అలవెన్సులపై కట్ చేసిన ఇన్‌కమ్ టాక్స్‌ను తిరిగి చెల్లించాలని జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మారుపేర్ల సమస్య కోర్టు కేసులు, విజిలెన్స్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. మెరుగైన క్యాడర్ స్కీంను తక్షణమే అమలు చేయాలని, యాక్టింగ్ విధుల్లో ఉన్న కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, నూతన బదిలీ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. జూన్ నుండి 12వ వేజ్ బోర్డు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, వేతన కమిటీ నియామకానికి ఐఎన్టీయూసీ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, కేంద్ర నాయకులు సిహెచ్. భీమ్ రావు, గరిగస్వామి, జీవన్ జోయల్, ఏ. రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:**

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన నీలి రమేష్ (50) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గోపాల్‌పేట్‌కు చెందిన నీలి రమేష్ కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడు, గత కొన్ని రోజుల నుండి ఇంటి నిర్మాణానికి డబ్బులు అవసరమని దిగులుతో ఉంటున్నాడు. ఈ ఆర్థిక సమస్యలతో బుధవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుండి పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి, అక్కడ చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడి కొడుకు ప్రశాంత్ ఇచ్చిన దరఖాస్తు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.


ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన మైనర్ బాలుడు కామటి చరణ్ మృతదేహం

## ట్రాక్టర్ ప్రమాదంలో మైనర్ బాలుడు మృతి


**సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:**

మండలంలోని యాకరపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలుడు కామటి చరణ్ (15) ట్రాక్టర్ ప్రమాదంలో మరణించాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం యాకరపల్లి గ్రామానికి చెందిన కామటి చరణ్ నిన్న సాయంత్రం అదే గ్రామానికి చెందిన సత్యపాల్ రెడ్డి యొక్క ట్రాక్టర్‌ను వ్యవసాయ పనుల కోసం నడుపుతుండగా యాకరపల్లి నుండి బోరిగాం వెళ్లే దారిలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు కింది వైపు గల పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో ట్రాక్టర్‌పై నుండి తప్పించుకునేందుకు చరణ్, ట్రాక్టర్ పైన ఉన్న గంగన్న అనే వ్యక్తులు దూకగా ప్రమాదవశాత్తు చరణ్ పై నుండి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. ఈ విషయమై ఎస్సై కేసు నమోదు చేసి, మృతదేహానికి నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

## జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

**సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:**

మండలంలోని మలక్ చించోలి గ్రామానికి చెందిన సింగిరెడ్డి భోజవ్వ (55) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుని మరణించింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మలక్ చించోలి గ్రామానికి చెందిన సింగిరెడ్డి భోజవ్వకు మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది, అప్పటి నుండి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వాకర్ సహాయంతో నడుస్తోంది. ఈ క్రమంలో జీవితం పైన విరక్తి చెంది బుధవారం సాయంత్రం స్వర్ణ వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త భోజన్న ఇచ్చిన దరఖాస్తు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు, మృతురాలికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నట్లు తెలిపారు.



## క్షయ వ్యాధి నిర్ధారణకు ట్రూనాట్ సేవలు

**- పీహెచ్‌సీలో ఆధునిక క్షయ నిర్ధారణ పరికరం**

**మందమర్రి, మే 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మందమర్రి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ట్రూనాట్ మిషన్ వైద్య సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధి సుదర్శన్, ఉపజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఎంపీడీవో రాజేశ్వర్, మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు, వైద్యాధికారులు డాక్టర్ ఇవాంజెలిన్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్‌వోలు కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్ శ్రీనివాస్, డీపిహెచ్‌ఎం పద్మ, క్షయవ్యాధి నియంత్రణ సమన్వయకర్త సురేందర్, ల్యాబ్ టెక్నీషియన్లు శారద, గట్టయ్య, ఎస్‌టీఎస్ కుమార్, వేణు, అర్బన్ పీహెచ్‌సీ పర్యవేక్షకురాలు విజయ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. జిల్లాలోని ఐదు ఆరోగ్య కేంద్రాల్లో ట్రూనాట్ క్షయవ్యాధి నిర్ధారణ పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరికరాల ద్వారా క్షయవ్యాధిని వేగంగా నిర్ధారించి సత్వర చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. ప్రజలందరూ క్షయవ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలని, అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా నివారించవచ్చని తెలిపారు. ఇదే సమయంలో జిల్లాలో తీవ్ర ఎండలు నమోదవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లో ఆశ ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారులు సూచించారు.



## రన్నింగ్ బైక్‌లో మంటలు.. అప్రమత్తతో తప్పిన ప్రమాదం

**వేమనపల్లి, మే 20, ప్రభాతవార్త**



ముల్కలపేట గ్రామానికి చెందిన ఎల్కరి సంజీవ్ బుధవారం పని నిమిత్తం బైక్ పై చెన్నూరు వెళ్తున్న క్రమంలో మల్లంపేట అడవిలో కల్వర్టు వద్ద బైక్ నుండి పేలిన శబ్దం రావడంతో అప్రమత్తమై బైక్ దిగి దూరం పరిగెత్తారు. బైక్ నుంచి అకస్మాత్తుగా పొగలు, మంటలు వేగంగా వ్యాపించడంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు కానీ ఫలితం లేకుండా పోయింది. అనంతరం ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటనపై వివరాలు సేకరించారు. అధిక ఎండ వేడికి షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఎంవీటీసీని తనిఖీ చేసిన అధికారులు

**తాండూర్, మే 20, ప్రభాతవార్త :**



బెల్లంపల్లి ఏరియా ఎంవీటీసీ గనుల వృత్తి శిక్షణ కేంద్రాన్ని బుధవారం డిఎంఎస్ (మైనింగ్) అశోక్ కుమార్, డిడిఎంఎస్ (మైనింగ్) కనకం ప్రేమ్ కుమార్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలోనీ వసతులు, శిక్షణ తరగతులు పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అంతకు ముందు జనరల్ మేనేజర్ కార్యాలయంలో వారిని బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర రెడ్డి సన్మానించి పూల మొక్కను అందించారు. కార్యక్రమమలో కైరిగూడ పిఓ మచ్చగిరి నరేందర్, ఇంచార్జి ఎస్ ఓ టు జి ఎం ఉమాకాంత్, ఎంవీటీసీ మేనేజర్ మధుసుదన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ఆసిఫాబాద్, మే 20, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బడే నాగజ్యోతి, గోలేటి సర్పంచ్ అజ్మీరా బాబురావు, మాజీ సర్పంచ్ బానోతు బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధికి జనభాగీదారి అభియాన్

### - ఉప సంచాలకురాలు రమాదేవి

**ఆసిఫాబాద్, మే 20, ప్రభాతవార్త :**

ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా జనభాగీదారి అభియాన్‌ను ప్రవేశపెట్టినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదిమ గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యక్తిగత, సామూహిక అభివృద్ధితో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని అడ్డాఘాట్, ఆర్.ఎస్.పల్లి గ్రామాల్లో జనభాగీదారి అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ఏసీఎంవో మరియు ఎస్‌సీఆర్‌పీలు సూచనలు చేశారు. అనంతరం ఆర్.ఎస్.పల్లి శాటిలైట్ సెంటర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌సీఆర్‌పీలు రవీందర్, అనంత్, శ్యామ్‌రావు, జీపీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రైతులు దొడ్డురకాల వరిపంట వేయద్దు..

### బోనస్‌తో కూడిన సన్నరకాల వరిపంట సాగుచేయండి - నిషేధిత పత్తివితనాలు అమ్మినా, గొనుగోలు చేసినా కఠిన చర్యలు

### లైసెన్స్ ఉన్న ఎరువుల దుకాణాల్లోనే వరి, పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలి: జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ.సురేఖ వెల్లడి

**చెన్నూరు, మే 20, ప్రభాతవార్త**

నకిలీ పత్తి విత్తనాల సరఫరా చేసినా, నిలువ, అమ్మకం, కొనుగోలు చేసినా అలంటివారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎ. సురేఖ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కిష్టంపేట రైతువేదికలో నియోజకవర్గ స్థాయి ఎరువుల డీలర్లు, రైతుల సమావేశంలో వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి ఎల్తూరి సురేఖ మాట్లాడుతూ, లైసెన్స్ పొందని అనుమతి లేని ఎట్టి విత్తనమైన నకిలీ దిగా పరిగణింప పడుతుందని, రైతులు లైసెన్సు పొందిన అధికృత డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ముఖ్యంగా పత్తి విత్తనాల్లో గడ్డి మందు రహిత నిషేధిత పత్తి విత్తనాలు అనుమతి లేనివి రైతులు వివిధ మార్గాల ద్వారా పొందుతున్నారని, అట్టి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేనందున కొనుగోలు చేయరాదని అన్నారు. నిషేధిత గడ్డి మందు గ్లైపోసెట్ వినియోగించరాదని, రైతులు వరిలో దొడ్డ రకాలను సాగు చేయరాదని, అట్టి వరి రకాలకు మార్కెటింగ్ సౌకర్యము ఉండదని తెలిపారు. ప్రతి సీజన్లో సన్న రకాలు అయినటువంటి బీపీటీ 52 04, తెలంగాణ సోనా, హెచ్ఎంటి సోనా, జేజీఎల్ 1798, వరంగల్ 14, కేఎన్ఎం 1638 వంటి ప్రాధాన్య రకాలను సాగు చేసి బోనస్ కూడా పొందవచ్చునని తెలిపారు. చెన్నూరు సిఐ బన్సీలాల్ మాట్లాడుతూ అనుమతిలేని పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన లేదా అమ్మకం చేసిన పిడి ఆక్ట్ నమోదు చేయడం జరుగుతుందని, విత్తన చట్టం కఠినతరంగా ఉన్నందున రైతులు కేసుల్లో ఇరుకోరాదని తెలిపారు.




డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధిత పత్తి విత్తనాల నిలువ, అమ్మకము వంటి వాటిని ప్రోత్సహించరాదని, ఎవరైనా గ్రామాల్లో ఇటువంటి విత్తనాలు అమాయక రైతులకు అమ్మ చూపినప్పుడు వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని, నిషేధిత పత్తిని అరికట్టడంలో సహకరించాలని చెన్నూరు ఏడిఏ బానోత్ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏవోలు కిరణ్మయి, సుధాకర్, శివ లీల, సాయి కృష్ణ డివిజన్ పరిధిలోని డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**తాండూర్, మే 20, ప్రభాతవార్త :**



మండలంలోని కొత్తపల్లి రైల్వేగేట్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..... కొత్తపల్లి పంచాయతీ సెక్రటరీ బుధవారం ఉదయం కొత్తపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడి ఉందని పోలీసులు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడ రైల్వే ట్రాక్ దగ్గర పని చేస్తున్న వారిని విచారించగా మృతుడు మంగళవారం ఉదయం రైల్వే ట్రాక్ మీద పిచ్చి పిచ్చిగా తిరుగుతుండగా గేట్ మెన్ అక్కడ నుంచి వెళ్ళి పొమ్మన్నాడు. పక్కనే పని చేస్తున్న పని వాళ్ళ దగ్గరకి వెళ్ళి వాళ్ళ దగ్గర మంచి నీళ్ళు తాగి మరల అక్కడ నుంచి బయటకు వెళ్ళి తరవాత మరల ఒంటి మీద బట్టలు లేకుండా ఒక డ్రాయర్ మీద రైల్వే ట్రాక్ మీద పిచ్చి పిచ్చిగా తిరిగాడు. ఆ తరవాత పక్కనే ఉన్న మామిడి తోటలో కి వెళ్ళి అక్కడ నుంచి వచ్చి ట్రాక్ పక్కన ఉన్న పొలం నుంచి రైల్వే ట్రాక్ మీదకు దూకగా అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఫోటోను చూసి గుర్తు పట్టితే తాండూర్ పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మే 20, ప్రభాతవార్త :**



రాజీవ్ గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించాలని డీసిసి అధ్యక్షురాలు సుగుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ ఆదేశాల మేరకు మే 21న భారత రత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఉగ్రవాద వ్యతిరేక దినంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. అన్ని మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో సైతం రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో సహపంక్తి భోజనాలు, అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, ఆసుపత్రులు, వసతి గృహాలలో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

**తాండూర్, మే 20, ప్రభాతవార్త :**

ఎండలు ముదురుతున్న దృష్ట్యా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో బుధవారం ఆడే సత్తమ్మ అనే మహిళా కూలీ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది సత్తమ్మను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి అక్కడ పని చేస్తున్న కూలీలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో ముదరడంతో కూలీలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో తగినంత నీరు తాగుతూ విశ్రాంతి తీసుకుంటూ పనులు చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు ఆరోగ్య భద్రతకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

## మనస్థాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం

**ఆసిఫాబాద్, మే 20, ప్రభాతవార్త :**

మనస్థాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆసిఫాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్‌లోని సందీప్నగర్‌కు చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. బుధవారం (20న) మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులు ఆ బాలికను ఇంట్లో స్నానం చేయలేదని మందలించడంతో మనస్థాపానికి గురైంది. దీంతో వారి ఇంటి సమీపంలోని బజార్వాడి బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు 100 డయల్ ద్వారా ఆసిఫాబాద్ పోలీసులకు సమాచారం అందించగా, ఆసిఫాబాద్ పోలీసులు వెంటనే స్పందించి ఫైర్ స్టేషన్ సిబ్బంది సహాయంతో బాలికను బావి నుండి సురక్షితంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన్నట్లు ఎస్హెచ్ఓ పేర్కొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత

నస్పూర్, మే 20, ప్రభాతవార్త



గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి హాజరై జిల్లాలో పని చేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్ల వివరాలు ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్‌కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని, లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని, ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి అనుమతి తీసుకోవాలని, మూసివేసిన స్కానింగ్ సెంటర్ లో ఉన్న పరికరాలు, యంత్రాలను విక్రయించినట్లయితే కొనుగోలు చేసిన వారి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. అరుణశ్రీ, డా. శ్రీదేవి, డా. సుధాకర్, డా. అభినవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ హారిక, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీకి కరెంట్ వైర్ తగిలి అగ్నిప్రమాదం

వేమనపల్లి, మే 20, ప్రభాతవార్త



పొలం నుంచి వరి గడ్డి తీసుకువస్తున్న సమయంలో ట్రాక్టర్ ట్రాలీకి విద్యుత్ వైర్లు తగలడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాలకు వెళితే జాజులపేట గ్రామానికి చెందిన రైతు మధూకర్ పొలం నుండి వరిగడ్డి తీసుకొస్తున్న సమయంలో కరెంటు తీగలు తాకి ఒకసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీ పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు వెంటనే స్పందించిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ట్రాలీ పూర్తిగా కాలిపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం. ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు

హాజీపూర్,మే 20, ప్రభాతవార్త

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి కేటాయించబడిన గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలోని గాయత్రి రైస్ మిల్లు, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ లోని రాజరాజేశ్వరి గోదాములను మండల తహసిల్దార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా గోదాములకు తరలించడం జరుగుతుందని, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, దిగుమతికి సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డెక్కిన రైతులు

### - మొక్కజొన్న బస్తాలను వెంటనే తరలించాలని డిమాండ్

బజార్‌హత్నూర్, మే 20, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో రైతులు పండించిన మొక్కజొన్నను కొనుగోలు చేసి వారం గడిచినా 7000 బ్యాగులను గోదాముల్లోకి తరలించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మండల రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అకాల వర్షానికి ధాన్యం బస్తాలు తడుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే లారీలను పంపించి లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జొన్న పంటను ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్, రాములు, ప్రభాకర్, రాజన్న, సాయన్న, నందు, ధనుంజయ్, ఫరీద్ ఖాన్, శంకర్, సోం రామ్ రెడ్డి, శ్రీనివాస్, చిన్నయ్య, వినాయక్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలి

### - మెడికల్ అసోసియేషన్ డిమాండ్

సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:



మండల కేంద్రంలో ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంఘం పిలుపుమేరకు బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలోనూ మెడికల్ షాపులను మూసివేశారు. ఈ సందర్భంగా మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా దుకాణాలను మూసివేసి నిరసన తెలిపినట్లు చెప్పారు. ఆన్‌లైన్ అమ్మకాల వల్ల స్థానిక నిబంధనల ప్రకారం నడుస్తున్న మెడికల్ షాపుల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో పెట్టుబడి పెట్టి దుకాణాలను నిర్వహిస్తున్నామని, ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల తమ కుటుంబాల పోషణ భారమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మహేష్, కోశాధికారి పొల్ద గణేష్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సాహెబ్ రావు

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేసిన సర్పంచ్ సాహెబ్‌రావు

సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:

మండలంలోని కంకేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు సలేందర్ తిరుమల ఇల్లుకు ముగ్గు పోసి ఇల్లు నిర్మాణం పనులను సర్పంచ్ సాహెబ్ రావు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తనకు ఇల్లు రావడంపై లబ్ధిదారు సలేందర్ తిరుమల ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఖాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.



పాండిచ్చేరిలో జరిగిన రెస్లింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన గడపాలి రణ్‌వీర్

## సిల్వర్ మెడల్ సాధించిన రాజుర కుర్రాడు

కుబీర్, మే 20, ప్రభాతవార్త:

కుబీర్ మండలంలోని రాజుర గ్రామానికి చెందిన గడపాలే రాజు, జ్యోతి కుమారుడు గడపాలి రణ్‌వీర్ రెస్లింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. ప్రస్తుతం ముధోల్ లోని గురుకుల పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థి చదువుతోపాటు రెస్లింగ్ కోచింగ్ తీసుకున్నాడు. 15 రోజుల సమ్మర్ క్యాంపులో రణ్‌వీర్‌ను అకాడమీలో విజయ్ కుమార్ సెలెక్ట్ చేశారు. ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన 2025-2026 రెస్లింగ్ పోటీలలో రణ్‌వీర్ పాల్గొని సిల్వర్ మెడల్ గెలిచాడు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నానమ్మ ప్రోత్సాహంతోనే ఈ మెడల్ సాధించానని రణ్‌వీర్ తెలిపాడు. రణ్‌వీర్ సిల్వర్ మెడల్ సాధించిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ అతనిని ప్రత్యేకంగా అభినందించారు.

## మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి

సారంగాపూర్, మే 20, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని సారంగాపూర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబటి రాజేశ్వర్ సందర్శించారు. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండలంలో, నిర్మల్ నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. జొన్న రైతుల ఆందోళనల నేపథ్యంలో త్వరలోనే కొనుగోళ్లు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరికిపండ్ల స్వదేశ్, ఒలత్ర నారాయణ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబటి రాజేశ్వర్

# మందమర్రి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు

### ఉత్పత్తి లక్ష్యాల సాధనే లక్ష్యం - ఉద్యోగులు పునరంకితం కావాలి: జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ





**మందమర్రి, మే 20, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మందమర్రి ఏరియా పరిధిలోని చారిత్రాత్మక శాంతిఖని భూగర్భ గనిలో మొదటి, రెండవ, మూడవ షిఫ్టల ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో అధికారులు హాజరై దిశానిర్దేశం చేశారు.

**శాంతిఖని గని ప్రాముఖ్యతపై ప్రత్యేక దృష్టి...**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శాంతిఖని గని సింగరేణి సంస్థలోనే కాకుండా మందమర్రి ఏరియాలో ప్రత్యేక గుర్తింపు పొందిన గనిగా నిలిచిందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా నిరంతర ఉత్పత్తి అందిస్తూ అనేక నైపుణ్య గల ఉద్యోగులు, అధికారులకు పుట్టినిల్లుగా నిలిచిందని కొనియాడారు. సంక్లిష్ట భౌగోళిక పరిస్థితుల్లో కూడా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఉద్యోగుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

**ఉత్పత్తి అండ్ సంక్షేమ అంశాలపై సమగ్ర చర్చ...**

సమీక్ష సమావేశాల్లో సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలపై విస్తృత చర్చ జరిగింది. భూగర్భ గనుల్లో ఆధునిక యంత్రాల వినియోగం, ఉత్పాదకత పెంపు, ఉద్యోగుల సంక్షేమ పథకాలు, ఆర్థిక అంశాలపై అధికారులు వివరించారు. అలాగే సంస్థ భవిష్యత్ కార్యాచరణ, ఎదురయ్యే సవాళ్లు మరియు వాటిని అధిగమించే మార్గాలపై చర్చించారు. ఉద్యోగులు క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని స్పష్టం చేశారు.

**నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి...**

భూగర్భ గనుల నుండి వెలికితీసే బొగ్గు నాణ్యతను మెరుగుపరచడం అత్యంత కీలకమని అధికారులు తెలిపారు. బొగ్గుతో పాటు రాయి, మట్టి కలవకుండా గని లోపలే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతిఖని బొగ్గుకు మార్కెట్లో ఉన్న మంచి డిమాండ్‌ను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ఎస్.కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎమ్) బాలాజీ, ఏజిఎమ్ (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, డిజిఎం పర్సనల్ అశోక్, డిజిఎమ్ ఐఈడి కిరణ్ కుమార్, క్వాలిటీ ఇన్‌చార్జ్ ప్రదీప్, గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, సంక్షేమ అధికారి రవి కుమార్ తదితరులు, గని ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు నాగా లేకుండా విధులకు హాజరై సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలి

**- పాత స్ఫూర్తితో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపు**

**- ఆర్.కె 5, ఆర్.కె న్యూ టెక్ గనుల్లో మూడో రోజు మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు**

**నస్పూర్, మే 20, ప్రభాతవార్త**



ఉద్యోగులు నాగా లేకుండా తమకు అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించి సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సింగరేణి యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్.కె 5, ఆర్.కె న్యూ టెక్ భూగర్భ గనుల్లో ఈ అవగాహన సదస్సులు జరిగాయి. ఇందులో ఆర్.కె 5 గనిలో జరిగిన సమావేశానికి మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల గైర్హాజరీ సంస్థకు అత్యంత ఇబ్బందిగా మారిందని, కొందరు విధులకు రాకపోవడం వల్లే ఆశించిన ఉత్పత్తి సాధించలేకపోతున్నామని మునిగంటి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిలోనే ఆర్కే 5 గనికి మంచి గుర్తింపు ఉందని, గతంలో ఒకే ఏడాది 6 లక్షల 82 వేల టన్నుల ఉత్పత్తి సాధించిన ఘన చరిత్ర ఈ గనికి ఉందని గుర్తుచేశారు. కార్మికులు అదే స్ఫూర్తితో రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని కోరారు. గత ఏడాది 95 శాతంతో కొద్ది తేడాతో ఉత్పత్తి లక్ష్యానికి దూరంగా నిలిచారని, ఈసారి నూటికి నూరు శాతం సాధించాలని ఆకాంక్షించారు. ఆర్.కె 5 గనిలో టీం 1 ప్రతినిధులు, ఆర్.కె న్యూ టెక్ గనిలో టీం 2 ప్రతినిధులు ఉద్యోగులకు సంస్థ ఆర్థిక పరిస్థితులు, రక్షణ, నాణ్యత, సంక్షేమ కార్యక్రమాలలో లోటుపాట్లపై అవగాహన కల్పించారు. కొత్త ప్రాజెక్టులు రాకపోవడం, ఉన్న గనులు మూతపడనున్న పరిస్థితులు, మార్కెట్ పోటీని వివరించి అధికారుల బృందంతో పాటు కమిటీ కన్వీనర్లు ఎన్. సత్యనారాయణ, కూర్మ రాజేందర్ దిశానిర్దేశం చేశారు. కార్మికులు గైర్హాజరీ తగ్గించుకుని రెగ్యులర్‌గా డ్యూటీ చేయాలని గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధి చంద్రమోహన్ కోరారు. కాగా, గురువారం టీం 1 ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ ఓసీ, టీం 2 ఆధ్వర్యంలో ఎస్సార్పీ సీహెచ్ పీలో సమావేశాలు జరగనున్నాయి.




## బొగ్గు గని కార్మికులు ఐక్యంగా ఉండాలి: ఐఎంవీఎఫ్ జనరల్ సెక్రటరీ రామేంద్ర కుమార్

**- సభకు హాజరైన మందమర్రి నాయకులు**

**మందమర్రి, మే 20, ప్రభాతవార్త**

ఒడిస్సా రాష్ట్రంలోని పూరి నగరంలో నిర్వహించిన ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ 14వ జాతీయ మహాసభలో బొగ్గు గని కార్మికులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఐక్యంగా ఎదుర్కోవాలని ఐఎంవీఎఫ్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ రామేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. బటోగే తో మీటోగే అంటూ కార్మికులు, నాయకులు ఐకమత్యంగా ఉండాలని సూచించారు. కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. రాబోయే 12వ వేజ్ బోర్డు సాధనలో కూడా ఏఐటీయూసీ ముందుండి పోరాడుతుందని తెలిపారు. తెలంగాణలో సింగరేణి కార్మికులు ఐక్యంగా పోరాడి సిపిఐ ఎమ్మెల్యేను గెలిపించుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సింగరేణి కార్మిక సంఘ నాయకత్వాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, ఐఎంవీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల కోల్ ఇండియా నాయకులు పాల్గొన్నారు. మందమర్రి ఏరియా నుంచి ఎండీ అక్బర్ అలీ, శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, భీమనాథుని సుదర్శన్, దాసరి తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ మీడియా, కమ్యూనికేషన్ కన్వీనర్‌గా చిప్పకుర్తి శశిధర్ నియామకం

**మందమర్రి, మే 20, ప్రభాతవార్త**



మందమరి పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ నియామకం చేపట్టింది, ఇందులో భాగంగా గురువారం రోజున మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ మీడియా, కమ్యూనికేషన్ కన్వీనర్‌గా నియమితులైనారు. ఈ సందర్భంగా చిప్పకుర్తి శశిధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం పనిచేస్తానన్నారు. అలాగే ప్రతిపక్ష పార్టీల తప్పుడు ఆరోపణలను ప్రజల ముందుంచి ఎండగడుతూ, పార్టీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతానని తెలిపారు.

## కోలంగూడా, పర్ధాన్ గూడాల్లో వెలుగులు

**- డిఏ-జెజియుఏ పథకం ద్వారా గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు**

**కాగజ్‌నగర్ రూరల్, మే 20, ప్రభాతవార్త :**



విద్యుత్ కనెక్షన్‌లు కల్పిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని కోలంగూడా, పర్ధాన్ గూడా గిరిజన ఆవాసాల్లో విద్యుత్ సౌకర్యం లేని గృహాలకు ధర్తీ అబ్ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఏ-జెజియుఏ) పథకం ద్వారా ఉచిత విద్యుత్ కనెక్షన్లు కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లు, పరికరాలు అమర్చడంతో పాటు మీటర్లు బిగించారు. దీంతో గిరిజన కుటుంబాల ఇళ్లలో విద్యుత్ వెలుగులు నిండాయి. గ్రామ సర్పంచ్ వసాకే పుల్లాబాయి మాట్లాడుతూ విద్యుత్ లేని గిరిజన గృహాలకు సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఎన్‌పిడిజిఎల్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జాడే ఉత్తమ్ (ఎస్ఈ), బి. వీరేష్ (డిఈ ఎంఆర్‌టి), సి. నాగరాజ్ (డిఈ ఆపరేటర్), పి. శ్రీనివాస్ (ఏడీఈ/ఎస్‌పిఎం), జె. రాజేశ్వర్ ( ఏడీఈ), జెహెచ్ శ్రీకాంత్ (ఏఈ) తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన పేరుతో మభ్య పెడుతున్న ప్రభుత్వం

## - 895 రోజులైనా అమలుకాని హామీలు

## - బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్

**బజార్‌హత్నూర్, మే 20, ప్రభాతవార్త:**




అమలు కాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం సగం మందికే గ్యాస్ సబ్సిడీ అందిస్తుందని, అనేకమంది లబ్ధిదారులకు రూ.500 ఖాతాల్లో రావడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సగం మందికే డబ్బులు జమ చేస్తుందని, ఇప్పటికే మూడు విడతల రైతుబంధు ఎగ్గొట్టి నెలకు ఒక ఎకరానికి వేస్తూ కాలయాపన చేస్తుందని పేర్కొన్నారు. ప్రజా పాలన అంటే సగం మందికి సగం రేటు, మహిళకు ఫ్రీ టికెట్, మగవారికి డబుల్ టికెట్, కట్టిన ఇండ్లు కూల్చడం, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు పెట్టడమా అని ప్రశ్నించారు. 100 రోజుల్లో హామీల అమలు అని చెప్పిన మాట అవాస్తవమని, 895 రోజులైనా హామీలు అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి దత్తత జిల్లాగా పేరు ఉన్న ఆదిలాబాద్ కు అసెంబ్లీలో మూడు బడ్జెట్ సమావేశాలు పూర్తయినా మూడు పైసలు కూడా కేటాయించలేదని ఆరోపించారు. జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు, ఇంజినీరింగ్ కళాశాల, ఎయిర్‌పోర్టు, సీసీఐ పునఃప్రారంభానికి అనుమతులతోనే రావాలని డిమాండ్ చేశారు. కొడంగల్ కు రూ.10,000 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు రూ.5,000 కోట్లు మంజూరు పత్రంతోనే రావాలన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎకరానికి 25 క్వింటాళ్ల జొన్నలు కొనాలని డిమాండ్ చేసి, నేడు అధికారంలో ఉండి ఎకరానికి 10 క్వింటాళ్లే కొనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. గన్ని బ్యాగులు లేక రైతులు మార్కెట్ యార్డుల్లో, కొనుగోలు కేంద్రాల్లో వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యూత్ లీడర్‌షిప్ సదస్సు

**నిర్మల్, మే 20, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్ పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో యూత్ లీడర్‌షిప్ సమ్మిట్" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. నేటి యువతే రేపటి నాయకులని, ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయ, సామాజిక రంగాల్లో యువత పాత్ర అత్యంత కీలకమన్నారు. యువజన, క్రీడల శాఖ ద్వారా జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి సూచించారు. ఉపాధి అవకాశాలపై ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో భాగంగా విద్యార్థులకు "యువత దేశాభివృద్ధి" అనే అంశంపై ఉపన్యాస పోటీలు, "వికసిత భారత్" అనే థీమ్‌పై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్ కటుకం మధుకర్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

# పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుకు రావాలి

## - విద్యార్థులు పర్యావరణ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని

## - జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్, పర్యావరణ విద్య అంబాసిడర్ కటుకం మధుకర్

## - జాతీయ హరితదళం ఆధ్వర్యంలో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ సిర్పూర్(టి)లో అవగాహన కార్యక్రమాలు

**కాగజ్‌నగర్ రూరల్, మే 20, ప్రభాతవార్త :**

జాతీయ హరితదళం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆధ్వర్యంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిర్పూర్(టి)లో పర్యావరణ విద్యపై వివిధ అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పాటలు పాడి, నృత్యాలు చేసి, నాటికలు ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు జాతీయ హరితదళం తరఫున సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్, పర్యావరణ విద్య అంబాసిడర్ కటకం మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మొక్కలను పెంచకపోవడం, అడవులను సంరక్షించకపోవడం వల్ల వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దేవారావు, ఉపాధ్యాయులు జమునదాస్, సంతోష్, సందీప్, భూమన్న తదితరులు పాల్గొన్నారు. పోటీల ఫలితాల్లో పాటల పోటీల్లో సౌమ్య, శ్రావణి విజేతలుగా నిలిచారు. నృత్య పోటీల్లో సౌమ్య, జోష్ణ, శ్రావణి, సునీత, పావని ప్రతిభ కనబరిచారు. నాటిక ప్రదర్శనలో శ్రావణి, సౌమ్య, జోష్ణ, పావని, సునీతలకు బహుమతులు అందజేశారు.

# ఆధునిక సాగుపై రైతులకు అవగాహన

**చింతలమానేపల్లి, మే 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కర్జవెల్లి గ్రామ పంచాయతీలో బుధవారం జరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలుచ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కార్తీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజేటీఎస్ఎయు రాజేంద్రనగర్) నుండి ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్లాంట్ పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అమీర్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ కరుణి పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు. పొలాల్లో యూరియా మితిమీరిన వినియోగాన్ని తగ్గించాలని, భూసారాన్ని రక్షించుకోవడానికి పంట మార్పిడి పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. ముఖ్యంగా వరి, పత్తి, పప్పుధాన్యాల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. చీడపీడల నివారణ, అధిక దిగుబడుల సాధనపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చౌదరి నారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సంపూర్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులు

# నేరాలు అదుపు చేసేందుకే కార్డెన్ సెర్చ్

## - లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి

**లక్షెట్టిపేట, మే 20, ప్రభాతవార్త**



నేరాలను అదుపు చేసేందుకు పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని మహాలక్ష్మి వాడ గోదావరి రోడ్ మోదల రోడ్ లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 46 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వాడల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇండ్లను అద్దెకిచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకున్నాక అద్దెకివ్వాలని పరిచయం లేని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఇండ్లను అద్దెకి ఇవ్వకూడదు అన్నారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంక్ సమాచారాలు ఇతర ఓటిపిలు అడిగితే ఫోన్లో చెప్పకూడదని బ్యాంకు లావాదేవీలు ఏవి ఉన్నా వెంటనే బ్యాంకుకు వెళ్లి చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు మైనర్‌తో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం ఎస్సైలు గోపతి సురేష్, తహసీనుద్దీన్, ఉదయ్ కిరణ్‌తోపాటు లక్షెట్టిపేట సర్కిల్ పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.